

ఓటర్ల చైతన్యం వల్లే ప్రశాంతంగా పోలింగ్

మెయిన్‌లో...

ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

మంగళవారం | 14 మే, 2024 | పేజీలు : 5

# 'భువనగిరి'లో 72.34 శాతం పోలింగ్

### పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన రాచకొండ సిపి

### గంటపాటు పోలింగ్‌ను బహిష్కరించిన భూదాన్ పోచంపల్లి రైతులు

### యాదాద్రి జిల్లాలో మోరాయించిన ఇవిఎంలు




**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం సాయంత్రం ఐదు గంటల వరకు 72.34 శాతం పోలింగ్ నమోదయింది. ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గం లో 79.12 శాతం, భువనగిరిలో 74.24 శాతం, నకిరేకల్ 72.34 శాతం, తుంగతుర్తి 71.03 శాతం, మునుగోడు 79.67 శాతం, జనగామ 70.25, ఇబ్రహీం పట్నం 63.13 శాతం నమోదు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఎండలు విపరీతంగా ఉండటంతో ఓటర్లు 5 గంటల తర్వాత కూడా ఓట్లు వేయడానికి పోలింగ్ బూత్ కేంద్రాల్లో క్యూ కట్టారు. దీంతో ఎన్నికల అధికారులు అనివార్యంగా 5 గంటల తర్వాత కూడా పోలింగ్ నిర్వహించారు. ఉదయం 9 గంటల వరకు భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం వ్యాప్తంగా మందకొడిగా పోలింగ్ నడవడంతో 10.54శాతం మాత్రమే పోలింగ్ నమోదు కాగా 11 గంటల వరకు 27.97 శాతానికి చేరుకున్నది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 మధ్యన ఓటర్లు పోలింగ్ బూత్ లకు పోటెత్తడంతో అమాంతంగా పోలింగ్ 46.49 శాతం నమోదైనది. అదే ఒరవడితో పోలింగ్ కొనసాగడంతో మధ్యాహ్నం మూడు గంటల వరకు 62.05శాతం పోలింగ్ నమోదు కాగా, సాయంత్రం ఐదు గంటలకు 72.34 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 79.67 శాతం పోలింగ్ నమోదు కాగా అతి తక్కువగా ఇబ్రహీంపట్నంలో 63.13 శాతం మాత్రమే పోలింగ్ నమోదు కావడం గమనార్హం. రంగారెడ్డి జిల్లా పరిధిలోని హైదరాబాద్ శివారులో ఉన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో అతి తక్కువగా పోలింగ్ నమోదు కావడం అధికారులను విస్మయానికి గురిచేసింది. సార్వత్రిక లోక్ సభ ఎన్నికల పోలింగ్ సరళి, పోలీస్ బందోబస్తును రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి పర్యవేక్షించారు. భువనగిరి, వలిగొండ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ పోలీసు బందోబస్తు అధికారులు పోలింగ్ నిర్వహిస్తున్న తీరు గురించి పర్యవేక్షించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు.




### యాదాద్రి లో మోరాయించిన ఇవిఎంలు

యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి మండలం చందుపట్ల, వలిగొండ మండలంలోని 245 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించాయి.

### భూదాన్ పౌచంపల్లిలో రైతుల నిరసన

అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని భూదాన్ పోచంపల్లి మండలం కనుముక్కల గ్రామానికి చెందిన రైతులు గంటపాటు పోలింగ్ ను బహిష్కరించి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక రైస్ మిల్లుల యాజమాన్యం ధాన్యం కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం చేయడంతో పాటు మద్దతు ధర ఇవ్వకపోవడం వల్ల తమకి సమస్య ఏర్పడిందని రైతులు వాపోయారు తక్షణమే తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు చేసిన డిమాండ్ కు అధికారులు అంగీకరించడంతో రైతులు ఆందోళన విరమించి పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు.

## చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపు

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** భువనగిరి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తున్నారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆయన సోమవారం తేర్యాలలో పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ బూత్ లలో ఓట్ల సరళిపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో యువకులు, మహిళల ఓట్లే కీలకమని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందించే 6 గ్యారంటీ పథకాలు ప్రజలకు బాగా ఉపయోగపడుతున్నాయని అన్నారు. రాబోయే ఆగష్టు 15 లోగా ఏకకాలంలో 2 లక్షల రుమమాఫి అందించి ప్రజలకు మరింత చేరువ అవుతున్నట్లు తెలిపారు. బిఆర్ఎస్‌కు డిపాజిట్ వచ్చే పరిస్థితి లేదని,బిజేపి,బిఆర్ఎస్‌లు రెండు ఒకటేనని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, మోటకొండూరు మండల కిసాన్ సెల్ అధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి, చిన్నం రాములు,మంత్రి స్వామి, మరాఠీ మల్లయ్య, ఇరుకుల సునీత, వాకిటి విమల చామల అమరెందర్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, బుంగపట్ల నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా కొనసాగిన పార్లమెంట్ ఎన్నికలు

### జిల్లా ఎస్‌పి చందనా దీప్తి




**ప్రజాపక్షం /నల్లగొండ :** నల్లగొండ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు ఎలాంటి చిన్న అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జిల్లా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అని జిల్లా ఎస్‌పి చందనా దీప్తి తెలిపారు. పట్టణ కేంద్రంలోని చెన్నకేశవ మెమోరియల్ స్కూల్ లో ఎన్నికల నిర్వహణ పోలీస్ అధికారులతో కలిసి సందర్శించి, విధి నిర్వహణలో ఉన్న అక్కడి పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణ, పోలింగ్ తరువాత పోలింగ్ పరికరాలను కౌంటింగ్ కేంద్రాలకు తరలింపు గురించి పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం నల్లగొండ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈవిఎంలను భద్రపరిచే అనిశెట్టి దుప్పలపల్లి గోదాంలో ఈవిఎంల రిసెప్షన్ కేంద్రాలను సందర్శించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన భద్రతా చర్యలపైన అధికారులతో చర్చించి పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు తీసుకోవడం జరిగిందని తెలిపారు.

## సూర్యాపేట జిల్లాలో 74.61శాతం పోలింగ్ నమోదు



2 లో

## ఓటు వినియోగించుకున్న ఎంపి అభ్యర్థి చామల



**ప్రజాపక్షం/ శాలిగౌరారం :** భువనగిరి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి తన స్వగ్రామమైన నల్లగొండ జిల్లా, శాలిగౌరారం మండల పరిధిలోని బాలిశెట్టి గూడెం పోలింగ్ బూత్ నెంబర్ 85 లో ఓటును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.ప్రజలలో కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం ఉన్నదని, అత్యధిక మెజార్టీతో నన్ను గెలిపించి పార్లమెంటుకు పంపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఓటు వినియోగించుకున్న మున్సిపల్ ఛైర్మన్ భార్గవ్



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ తిరునగరు భార్గవ్ పిలుపునిచ్చారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో 46వ పోలింగ్ బూత్‌లో ఆయన సతీమణి మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ నాగలక్ష్మి తో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## ఓటర్లకు మంచినీటి సౌకర్యం



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** నార్కట్‌పల్లి పట్టణ మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్ల దాహార్తిని తీర్చేందుకు గ్రామ పంచాయతీ కార్యనిర్వహణ అధికారి ఎండి సుభాన్ అలీ చల్లటి నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా వేసవి కాలంను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేకంగా చల్లటి నీటి సౌకర్యంను ఏర్పాటు చేశారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు చల్లటి నీటి ఏర్పాటు పై నిర్వహకులకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఓటు వేసిన భాస్కర్‌రావు




**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని రెడ్డికాలనీలోని డౌహిల్ స్కూల్‌లో మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్‌రావు సతీమణి జయ, బీఆర్‌ఎస్ యువనేత నల్లమోతు సిద్దార్థ కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదన్నారు.

## పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎంఎల్‌ఎ కుంభం



**ప్రజాపక్షం/బీబీనగర్ :** భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా హోటల్లో ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరగడం అభినందనీయం అన్నారు. ఆయన వెంట జెడ్పిటిసి గోలి ప్రణీతా పింగళి రెడ్డి, ఎంపీటీసీలు పంజాల రామాంజనేయులు గౌడ్, గోలి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పోటొల్ల శ్యామ్ గౌడ్, మాజీ జెడ్పిటిసి సంధిగారి బసవయ్య, మాజీ ఎంపీపీ లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ పంజాల వెంకటేష్ గౌడ్, బండారు ఆగమయ్య గౌడ్, టంటం జహంగీర్, నాయకులు బంజారా పెంటయ్య గౌడ్, పంజాల శ్రీనివాస్ గౌడ్, ఉప్పలాంచి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు వజ్రాయుధం వంటిది : ఎంఎల్‌ఎ లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** ఓటు వజ్రాయుధం వంటిదని ప్రజాస్వామ్య పరిరక్షణకు తమవంతు బాధ్యతగా ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని శాసన సభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో 46వ బూత్‌లో కుటుంబసమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## సూర్యాపేట జిల్లాలో 74.61శాతం పోలింగ్ నమోదు



**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలో మొత్తం నాలుగు అసెంబ్లీ నియోకవర్గాలు ఉండగా నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు, భువనగిరి పార్లమెట్ పరిధిలో ఒక నియోజకవర్గంతో కలిపి మొత్తం 10,000,12 మంది ఓటర్లు ఉండగా 74.61శాతం ఓట్లు నమోదయ్యాయి. సూర్యాపేట నియోజకవర్గ పరిధిలో 73శాతం, హుజూర్ నగర్ 76.30, కోదాడ 75.15, భువనగిరి పార్లమెంట్ పరిధిలోని తుంగతుర్తి నియోజకవర్గంలో 74 శాతం ఓట్లు పోలయ్యాయి. జిల్లాలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే పర్యవేక్షణలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలు దాటిన తరువాతా కూడా కొనసాగింది. ఆయా నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల ఈవీఎంలకు సంబంధించిన ఏఆర్‌ఓలు సెక్టార్ అధికారుల సమక్షంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య రూట్ వాహనాల ద్వారా నల్లగొండ, భువనగిరిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచేందుకు తరలించారు. ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించిన ఓటర్లు, విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఇవిఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం

### నియోజకవర్గంలో 76.30 ఓటింగ్ నమోదు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. నియోజకవర్గంలో 308 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలో ఏర్పాటు చేసిన మహిళల పోలింగ్ కేంద్రాన్ని సుందరంగా అలంకరించి ఓటర్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఓటు వేసేందుకు వచ్చిన మహిళలు ఏర్పాట్లను వినియోగించుకుని హర్షం వ్యక్తం చేశారు. శుభకార్యానికి విచ్చేసినట్లు ఓటు వేసేందుకు వస్తే ఏర్పాట్లు అలా ఉన్నాయని పలువురు ఓటర్లు వ్యాఖ్యానించారు. గతంలో కంటే పార్లమెంట్ ఎన్నికలకు ఓటింగ్ శాతం పెరిగినట్లు అధికారులు తెలిపారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో 76.30శాతం ఓటింగ్ నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు. ఎంపిడివో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చనరవి ఓటును వేశారు.నియోజకవర్గంలోని మఠంపల్లి మండలం గుండ్లపల్లిలో నల్లగొండ పార్లమెంట్ బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన శానంపూడి సైదిరెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎంఎల్‌ఎ వేముల



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా నార్కట్ పల్లి మండల కేంద్రంలోని వివిధ వార్డులలో గల పోలింగ్ బూత్‌ల వద్ద ఉన్న పార్టీ కార్యకర్తలను కలిసి ఓటింగ్ సరళిని నకిరేకల్ ఎంఎల్‌ఏవేముల వీరేశం పరిశీలించారు. అదేవిధంగా పోలింగ్ శాతం పెంచేలా కృషి చేయాలనీ సూచించారు. ఓటర్లను ఇతర ప్రలోభాలకు గురికాకుండా చూడాలని, పోలింగ్ బూత్ వద్దకు రాలేని వృద్దులకు గాని, పేషంట్ లను ఓటు వేసేలా చూడాలని తెలిపారు.

## పిడుగు పడి ఆవు మృతి



**ప్రజాపక్షం/మోటకొండూరు :** మోటకొండూరు మండలంలోని తేర్యాలలో ఆదివారం రాత్రి వీచిన గలి దూమారంలో పిడుగు పడి బోంగు పుల్లయ్యకు చెందిన ఆవు మృతి చెందినది. సుమారు ఆవు విలువ 60 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని పుల్లయ్య కోరారు.

## గెలుపు కోసం.. సమష్టి కృషి అనిర్వచనీయం



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు కోసం మిర్యాలగూడ బీఆర్‌ఎస్ శ్రేణులు చేసిన కృషి అనిర్వచనీయమని మాజీ శాసనసభ్యుడు నల్లమోతు భాస్కర్‌ఱావు అన్నారు. నియోజకవర్గంలోని గడపగడపకు వెళ్లి కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కార్యకర్తలు వివరించారన్నారు. కేసీఆర్ చేపట్టిన పోరుబాట కార్యక్రమం రోడ్డు షో మిర్యాలగూడ నియోజకవర్గం నుంచే ప్రారంభం కావడం అదృష్టమన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్ష అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఓటర్లకు, కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## నార్కట్‌పల్లిలో పోలింగ్ ప్రశాంతం



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలు మండల పరిధిలో ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్ సమయం ముగిసే సరికి 43,139 ఓటర్లకు గాను 75 శాతం నార్కట్ పల్లి మండలంలో పోలింగ్ నమోదైంది. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద పోలీస్ శాఖ 144 సెక్షన్ అమలు చేయడంతో ఎటువంటి ఘర్షణలు, అసంఘీటీత కార్యక్రమలకు చోటు చేసుకోలేదు. సోమవారం ఉదయం 5 గంటలకే మాక్ పోలింగ్ ను నిర్వహించి పోలింగ్ కార్యక్రమం మొదలు పెట్టారు. ఎక్కడ కూడా ఈవీఎం మెషిన్ ల సతాహింపు, మొరహీంపు వంటి సమస్యలు తేలేత్తకుండా అధికారులు జాగ్రత్త పడ్డారు. ఈ సారి ఎన్నికలో ఓటింగ్ కు యువత, మహిళలే అత్యంత ఆసక్తి కనబర్చినట్లు తెలుస్తుంది. వాతావరణంలో కొద్ది పాటి గా అధిక ఉష్ణోగ్రతల నుండి ఉపశమనం కలిగిన ఓటర్లు ఓపికతో లైన్లో నిలబడి వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే



**ప్రజాపక్షం/సూర్యాపేట :** జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే సోమవారం జిల్లా కేంద్రంలోని తాళ్ళగడ్డ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయనతో పాటు ట్రైని ఎస్‌పి రాజేష్ మీనా కూడా ఓటును వేశారు. అలాగే జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ బిఎస్ లత శ్రీరాంనగర్‌లోని రామన్ కాన్సెప్ట్ స్కూల్ లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.


## ఓటుహక్కును వినియోగించిన చల్లా తేజ

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** నార్కెట్ పల్లి మండలంలోని మాద యడవల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చల్ల తేజా తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించున్నారు.సోమవారం జరిగిన సార్వత్రిక పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా ఓటు వేసేందుకు గ్రామానికి విచ్చేసి ఓపికతో పోలింగ్ స్టేషన్ వద్ద సమయం కేటాయించారు. ప్రజలతో పాటుగానే వరుసలో నిలబడి ఓటు వేశారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజల వజ్ర ఆయుధమని, దీనిని ప్రతి ఒక్కరు తప్పకుండ వినియోగించుకోవాలని కోరారు.

## ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

**ప్రజాపక్షం / హాలియా :** పార్లమెంట్ ఎన్నికలు నాగార్జున సాగర్ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గం లో రెండు నియోజకవర్గం లో 236434 ఓట్లు ఉండగా 169265 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గం లో 7126 శాతం పోలింగ్ జరిగింది. గ్రామాలలో ఓటింగ్ శాతం పెరగగా పట్టణాలలో ఓటింగ్ శాతం తగ్గింది. పార్లమెంట్ ఎన్నికల కావడంతో ఓట్లు వేసేందుకు చాలా మంది ఓటర్లు ఆసక్తి కనపరచకోవడం గమనార్హం. నియోజకవర్గంలో ఎన్నికల శాతం అసెంబ్లీ ఎన్నికల కంటే తగ్గడం గమనార్హం.

## ఓటు వేసిన జెడ్‌పిటిసి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లా ప్రాదేశిక సభ్యురాలు గోలి ప్రణీత పింగళి రెడ్డి దంపతులు సోమవారం మండల కేంద్రంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదే విధంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు పివి శ్యాంసుందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా ఎంపీటీసీ పంజాల రామాంజనేయులు గౌడ్, గోలి నరేందర్ రెడ్డి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఓటు వేసిన ప్రముఖులు



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** భువనగిరి మండలం వడపర్తి గ్రామంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే పట్టణంలోని 12వ వార్డు భూమాయపల్లిలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జిల్లా బాలకృష్ణారెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే అనంతరంలో చింతల వెంకశ్వర్ రెడ్డి ఓటు వేశారు.

## నిడమనూరులో పోలింగ్ ప్రశాంతం

**ప్రజాపక్షం/ నిడమనూరు :** నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నిడమనూరు మండలంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధి బంకాపురం పోలింగ్ కేంద్రంలో ప్రారంభంలోనే ఈవిఎం మోరాయించడంతో అక్కడ పోలింగ్ అర్ధగంట ఆలస్యంగా ప్రారంభమైంది. సోమవారం ఉదయం వాతావరణం చల్లగా ఉండటంతో పోలింగ్ చురుకుగా జరిగింది. ఎక్కడ అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు. పలు పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు లేక మహిళా సిబ్బంది అసౌకర్యానికి గురయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో ఎన్నికల సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

# మునుగోడు నియోజకవర్గంలో 83.70 శాతం పోలింగ్ నమోదు

మొత్తం ఓటర్లు 2,57,557

ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు 2,15,579

**ప్రజాపక్షం/చండూరు :** భువనగిరి పార్లమెంట్ పరిధిలోని మునుగోడు నియోజకవర్గంలో నిన్న జరిగిన ఎన్నికల్లో 83.70శాతం పోలింగ్ నమోదు అయ్యినట్లు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. నియోజవర్గంలోని 7 మండలాలలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండ ప్రశాంత వాతావరణంలో ఉన్నికలు జరిగాయి. నియోజకవర్గంలో అత్యధికంగా చౌటుప్పల్ మండలంలో 85.72 శాతం నమోదు కాగ అత్యల్పంగా మర్రిగూడం మండలంలో 81.43 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో



మొత్తం 2,57557 మంది ఓటర్లు ఉండా అందులో 2,15,579 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ అధికారులు ముందస్తూ జాగ్రతలు తీసుకున్నారు. చండూరు సిఐ వెంకటయ్య , ఎస్ఐ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో తమ సిబ్బంది తో కలిసి పటిష్ట బందోబస్తూ నిర్వహించారు.

# తుంగతుర్తి నియోజకవర్గంలో 74శాతం ఓటింగ్

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** తుంగతుర్తి నియోజకవర్గంలో 74శాతం ఓటింగ్ నమోదైనట్లు అసిస్టెంట్ ఎన్నికల అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ జిఎస్ లత తెలిపారు. నియోజకవర్గంలోని మండలాల్లోని గ్రామాల్లో ఏలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ జరిగినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవిఎంలు మొరాయించడంతో వాటి స్థానంలో వేరే ఈవిఎంలను ఏర్పాటు చేసేసరికి సుమారు అర్ధగంట ఆలస్యమైంది. తుంగతుర్తి మండలంలో 73.25, నూతనకల్ 73.39, మద్దిరాల 72, నాగారం 71.89, జాజిరెడ్డిగూడెం 77.64, తిరుమలగిరి 75.69, అడ్డగూడూరు 74.07, మోత్కూరు 75.12, శాలిగౌరారం మండలంలో 73.20 శాతం ఓట్లు నమోదైనట్లు ఆమె చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ తో పాటు మైక్రో అబ్జర్వర్ల పర్యేవక్షణలో ఎన్నికలు సజావుగా సాగినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పలు పోలింగ్ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ రమణరెడ్డి, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు వేసిన ఎంఎల్ఎ సామేలు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో ధర్మారం గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్న తుంగతూర్తి ఎమ్మెల్యే మందుల సామేలు దంపతులు

## ఓటు హక్కును వినియోగించుకున్న ఎంఎల్ఎ బాలునాయక్ దంపతులు



**ప్రజాపక్షం/దేవరకొండ :** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ దంపతులు స్వగ్రామం ముదిగొండ(కమలాపూర్)లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని బూత్ నెంబర్ 72లో ఓటు హక్కను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటు హక్కు తమ బాధ్యతగా భావించి ఓటు వేయాలని కోరారు.

## మిర్యాలగూడ నియోజకవర్గంలో 73.29శాతం పోలింగ్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ :** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గంలో పోలింగ్ సోమవారం సాయంత్రం 6గంటలకు ముగిసే సమయానికి సుమారు 1,73,215 మంది ఓటు వేయగా సుమారు 2,36,343 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 9 గంటల వరకు 12.55శాతం, 11గంటల వరకు 29.63శాతం, మధ్యాహ్నం 1గంటల వరకు 45.51శాతం, 3గంటల సమయంలో 54.72శాతం, సాయంత్రం 5గంటల వరకు 70.25శాతం, 6గంటల సమయానికి మొత్తంగా 73.29శాతంగా నమోదైనట్లు తెలిపారు.

## భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విధిగా ఓటు వేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట :** భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకోని ఓటు హక్కు కలిగిన వారు విధిగా ఓటు వేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పు ఇప్పుడు మారనుందని, ఐదు నెలల్లో ప్రజల ఆలోచనల్లో పెను మార్పు వచ్చిందన్నారు. కెసిఆర్ లేని లోటు స్పష్టంగా కనిపిస్తుందని ప్రజలు తమతో చెప్పుకుంటున్నారన్నారు. ప్రజల నుండి వస్తున్న స్పందన చూస్తుంటే అధిక సీట్లు గెలుస్తామనే నమ్మకం ఉందన్నారు. ఓటు హక్కును సరిగ్గా వినియోగించుకోకుంటే జరగబోయే నష్టానికి బాధ్యులమవుతామని చెప్పారు.

## ఓటు వేసిన మాజీ వైస్ ఎంపిపి

**ప్రజాపక్షం/ శాలిగౌరారం :** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం శాలిగౌరారం మాజీ వైస్ ఎంపీపీ, అడ్లూరు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు భూపతి అంజయ్యతో పాటు మండల నాయకులు నల్లగొండ శ్రీను, గరిగంటి శంకర్, చిత్తలూరు వెంకన్న, గోనె రవీందర్ రెడ్డి, దొనకొండ రవి తదితరులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాని ఈ సందర్భంగా అన్నారు.

## ఓటు వేసిన సిపిఐ నాయకులు





**ప్రజాపక్షం /నల్లగొండ :** పార్లమెంట్ ఎన్నికలో భాగంగా పట్టణంలో రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో సిపిఐ సినియర్ నాయకులు మల్లేపల్లి అదిరెడ్డి కుటుంబ సమేతంగా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి కూడా మేకల అభినవ్ అవుట్ డొరుస్టేడియంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## బాధలో కూడా బాధ్యత



**ప్రజాపక్షం/దేవరకొండ :** తండ్రి మరణంతో తీవ్ర శోక సంద్రంలో ఉన్నా సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్న బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ దంపతులు, కుటుంబ సభ్యులు.

## ప్రశాంతంగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్

**ప్రజాపక్షం/ (మునుగోడు) నల్లగొండ :** భువనగిరి పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ మండల వ్యాప్తంగా సోమవారం వివిధ గ్రామాలలో ప్రశాంతంగా నిర్వహించారు. మండలంలో మొత్తం 47 బూతులను ఏర్పాటు చేసి ఒక్కొక్క బూతుకు ఐదుగురు చొప్పున సిబ్బందిని ఏర్పాటుచేసి ఎన్నికలను నిర్వహించారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగిన పోలింగ్ మండల వ్యాప్తంగా 37343 ఓటర్లకు 31635 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 84.71 శాతం నమోదైంది.

## మండల వ్యాప్తంగా ప్రశాంతంగా పోలింగ్

**ప్రజాపక్షం/గుండాల :** యాద్రాది భువనగిరి గుండాల మండల వ్యాప్తంగా సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండల వ్యాప్తంగా 77.03 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. మండల వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది.

## ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు



**ప్రజాపక్షం/చందంపేట :** నల్గొండ జిల్లా చందంపేట మండల వ్యాప్తంగా సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మండల వ్యాప్తంగా 70శాతానికి పైగా పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. మండల పరిధిలోని చిత్రియాల గ్రామంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, పిసిసి సభ్యులు, పిఏసిఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, తిలక్‌రెడ్డిలు కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటును వినియోగించుకోవాలని ఓటు అనేది మన హక్కు గా భావించి ఓటు వేయాలని అన్నారు. తేల్దేవరపల్లి గ్రామంలో ఎంపిపి పార్వతి చందునాయక్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## మండలంలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్ :** మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.ఉదయం నుండే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని క్యూలైన్‌లో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## గుర్రం మీద వెళ్లి ఓటు వేసిన మాజీ సర్పంచ్



**ప్రజాపక్షం/చింతల-పాలెం :** పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా సోమవారం మండలంలోని రెబెల్లే మాజీ గ్రామ సర్పంచ్ నరసింహమూర్తి గుర్రం వెళ్లి ఓటు వేసి స్థానికులను ఆకట్టుకున్నారు. ఓటు వేసేందుకు గుర్రంపై వెళ్తున్న మాజీ సర్పంచ్‌ను స్థానికులు ఆసక్తిగా చూశారు. గుర్రపు స్వారీ అంటే ఇష్టమని ప్రత్యేకంగా ఉంటుందని గుర్రంపై వెళ్లి ఓటు వేసినట్లు ఆయన తెలిపారు.

## మండలంలో ప్రశాంతంగా ఎన్నికలు




**ప్రజాపక్షం/గరిడేపల్లి :** మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుండే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని క్యూలైన్‌లో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుండే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని క్యూలైన్‌లో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేసేందుకు వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆరోగ్య కేంద్రం తరపున ఏఎన్ఎంలు, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందచేశారు. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# ప్రత్యర్థి ఎవరైనా గెలుపు నాదే : రఘువీర్‌రెడ్డి

**ప్రజాపక్షం/నందికొండ :** నందికొండ మున్సిపాలిటీ పరిధిలో గురువారం ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రక్రియ ప్రారంభం అవ్వడంతో పట్టణ ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవటానికి తమ తమ పోలింగ్ బూతుల వద్ద ఓటర్లు బారులు తీరారు. స్థానికంగా ఏర్పాటు చేసిన 14 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే నల్లగొండ ఎంపి అభ్యర్థి కుందురు రఘువీర్ రెడ్డి, తండ్రి జానారెడ్డి తమ కుటుంబ సమేతంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రత్యర్థులు ఎవరైనప్పటికీ గెలుపుమాత్రం తనదేనని నల్లగొండ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి , కుందూరు రఘువీర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తన తండ్రి జానారెడ్డి మంత్రిగా ఉన్నపుడు తెలంగాణ రాష్ట్రానికి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులే తనకు శ్రీరామరక్షగా ఉన్నాయని తెలిపారు.అయితే నంది కొండ మున్సిపాలిటీ



హిల్ కాలనీ, పైలాన్ కాలనీలో ఉన్న ఓటర్లు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మందకుడిగా సాగి ఆ తర్వాత వేగం పుంజు కోవడంతో ప్రజలు బారులు తీరారు. వృద్ధులు వికలాంగులు సైతం ఉత్సాహంతో ఓటు వేయటానికి పోలింగ్ కేంద్రాల వద్దకు తరలి రాగ వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా వాలంటీర్ల ద్వారా ప్రతి పోలింగ్ బూత్ వద్ద ప్రత్యేకంగా చక్రాల కుర్చీలను ఏర్పాటు చేయడంతో వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## ఇవిఎం మొరయించి.. నిలిచిపోయిన ఓటింగ్

**ప్రజాపక్షం /మోటకొండూరు :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని మోటకొండూరు మండల పరిధిలోని చందేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాటశాల ఆవరణలో ఎంపీ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటుచేసిన 235/97 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరయించి ఓటింగ్ నిలిచిపోయిన సంఘటన చోటుచేసుకుంది. ఓటు వేయడానికి వచ్చిన ఒక ఓటరు ఓటు వేసే క్రమంలో ఈవీఎం పైన ఉన్న అభ్యర్థి గుర్తుపై ఉన్న బట్టన్ గట్టిగా నొక్కడం వల్ల బటన్ స్ట్రక్ అయిపోయి సాంకేతిక కారణాలతో ఒక్కసారిగా ఈవిఎం పనిచేయడం ఆగిపోయింది. వెంటనే విషయం గమనించిన



ఎన్నికల సిబ్బంది అప్రమత్తం అయ్యి ఓటింగ్ ప్రక్రియ నిలిపివేసి ఈవిఎం మెషీన్‌లో నెలకొన్న సాంకేతిక లోపాన్ని సరిచేసారు. అనంతరం పోలింగ్ ప్రక్రియ యధావిధిగా కొనసాగింది.

## నూతనకల్‌లో ప్రశాంతంగా ఓటింగ్




**ప్రజాపక్షం/నూతనకల్ :** నూతనకల్ మండలంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగినట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. మండలంలో మొత్తంగా ఎన్నికల్లో 28582 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు 14280, స్త్రీలు 14302 మంది ఉన్నారు. వీరు ఓటు హక్కును వినియోగించుకునేందుకు మండల వ్యాప్తంగా 35 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తాళ్ళసింగారం గ్రామంలో 2496 ఓట్లకుగాను 2496 ఓట్లు, సోమ్లాతండాలో 778 ఓట్లకుగాను 595 ఓట్లు, బక్క హేమ్లాతండా 809 ఓట్లకు 690 ఓట్లు, టీక్యాతండ 816 ఓట్లకు 662 ఓట్లు, యడవెల్లి 1748 ఓట్లకు 1380, లింగంపల్లి 1916కు 1518, మాచనపల్లి 1680కిగాను 1332, బిక్కుమళ్ళ 1331కి 736, పెద్దనెమిల 1751కిగాను 1261, దిర్శనపల్లి 844కి 636, మిర్యాల 2641కి 1958 ఓట్లు, అల్గూనూరు 771కి 554, నూతనకల్ 4492కు 3259, చిల్పకుంట్ల 2836కి 1839, వెంకేపల్లి 1429కి 1061, ఎర్రపహాడ్ 2544కు 1699 ఓట్లు పోలైనట్లు తెలిపారు. మొత్తం 28,582 ఓట్లకు కాను 21,107 ఓట్లు పోలైనట్లు చెప్పారు. మండల వ్యాపంతాగా 73.84శాతం పోలింగ్ అయినట్లు పేర్కొన్నారు. ఏలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఎంపిడివో సునీత, తుంగతుర్తి సిఐ శ్రీను, ఎస్ఐ జూకూరు సైదులు పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

## ఓటు హక్కు వినియోగించుకున్న 33 మంది ట్రాన్స్‌జెండర్లు



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో భాగంగా మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో మొత్తం 33 మంది ట్రాన్స్‌జెండర్లు ఉండగా వారిలో 20 మంది వివిధ పోలింగ్ స్టేషన్లలో ఓటు హక్కును సోమవారం వినియోగించుకున్నారని పీడబ్లుడీ దివ్యాంగుల, వయోవృద్ధుల నోడల్ అధికారి ఆర్.మమతలు తెలిపారు. ట్రాన్స్‌జెండర్లు బాలమ్మ, ప్రణీత, వైషూ, వెంకన్న, చల్లా శ్రావణి, రమ్య, సమీరా, లావణ్య, ప్రణీతలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ స్టేషన్ 53 విద్యానగర్ సహస్త్ర స్కూల్ లొకేషన్‌ను సందర్శించి ట్రాన్స్‌జెండర్లకు కల్పించిన సౌకర్యాల, సౌలభ్యం వల్ల వారు ఓటు హక్కును వినియోగించుకున్నామని సంతోషాన్ని వ్యక్తపరిచారని మమత తెలిపారు. ఓటు వేయాలని తమ శాఖ వారిని చైతన్య పరించిందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేవతి, బీసీ కవిత, అంగన్‌వాడి టీచర్లు చిన్నమ్మ, నర్మదా, ఆయాలు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న సత్యం



**ప్రజాపక్షం/(మునుగోడు) నల్లగొండ :** పార్లమెంటు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ దంపతులు.

## పండుగ వాతావరణం తలపించిన గ్రామాలు



**ప్రజాపక్షం/ రామన్నపేట :** మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల్లో ఎన్నికల పోలింగ్ సందర్భంగా సోమవారం 78.14 శాతం పోలింగ్ జరిగింది. పట్టణాల్లో ఉన్న ప్రజలు ఓటు వేయడానికి తమ సొంత గ్రామాలకు రావడంతో గ్రామాలు పండుగ వాతావరణం తలపించాయి. ఉదయం నుంచి ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో ఓటింగ్ సరళిని ఎమ్మెల్యే వేముల వీరేశం అడిగి తెలుకున్నారు. ఆయన వెంట ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. ఎంపీపీ పూస బాలమణిబాలనరసింహా దంపతులు తమ సొంత గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా రామన్నపేట మండల సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహా దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## మొరాయించిన 2 ఇవిఎంలు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మండలంలోని నందనం గ్రామంలో మధ్యాహ్నం సమయంలో పోలింగ్ కేంద్రంలో ఈవీఎం సాంకేతిక లోపం వచ్చి మొరాయించింది. ఈ గమనించిన అధికారులు వెంటనే ఆ ఈవీఎంకు మరమ్మతులు చేపట్టారు. దీంతో ఆ పోలింగ్ కేంద్రంలో అరగంట పాటు పోలింగ్ ఆలస్యంగా జరిగింది. అలాగే నాగిరెడ్డిపల్లి గ్రామంలో పోలింగ్ కేంద్రంలో ఈవెన్ మోరాయించడంతో ఒక గంటపాటు పోలింగ్ ఆలస్యంగా జరిగింది. అధికారులు వెంటనే మొరాయించిన ఈవీఎంకు మరమ్మతులు చేపట్టడంతో సమస్య పరిష్కారం అయింది.

### రేకులగడ్డ గ్రామంలో

**ప్రజాపక్షం/చందంపేట :** సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నల్గొండ జిల్లా చందంపేట మండలం రేకులగడ్డ గ్రామంలోని ఈవిఎం మొరాయించింది. అధికారులు వెంటనే వెంటనే అక్కడకు చేరుకొని సరిచేసిన గంటకు మళ్ళీ ఈవిఎం మోరాయించడంతో గ్రామస్థులు పాతకాలం నాటి పద్దతిలో గ్రామంలో ఏ పని చేసిన అక్కడ ఉన్న గ్రామ దేవతలకు కొబ్బరికాయలు కొడితే కాని ఈవిఎం పనిచేసిందని గ్రామస్థులు తెలిపారు.మండల వ్యాప్తంగా 70శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారుల తెలిపారు.

## పిడిఎస్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/చందంపేట :** నల్గొండ జిల్లా చందంపేట మండలం బుడ్డోని తండా గ్రామపంచాయతీలో సోమవారం రాత్రి చౌక ధరల దుకాణం నుండి సుమారు 10 క్వింటాళ్ళ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటీన స్థానిక ఎస్ఐ సతీష్ బుడ్డోని తండాకు చేరుకొని అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని పట్టుకొని తహశీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎవరైన అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

## తాజ్పూర్‌లో వలస ఓటర్లు



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** భువనగిరి మండలం తాజ్పూర్ గ్రామానికి చెందిన కొంత మంది ఓటర్లు వరంగల్ జిల్లా పాలకుర్తిలో పాలకుర్తికి బతుకు తెరువు కోసం వెళ్లారు. ఎంపీ ఎన్నికలలో భాగంగా సోమవారం ఉదయం పాలకుర్తి నుంచి తాజ్పూర్‌కు చేరుకున్నారు. అనంతరం తాజ్పూర్ గ్రామంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును సుమారు 50 మంది వినియోగించుకున్నారు. అనంతరం అక్కడ నుంచి పాలకుర్తికి వెళ్లారు.

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



**ప్రజాపక్షం/వేములపల్లి:** నల్లగొండ పార్లమెంటు ఎన్నికలలలో భాగంగా వేములపల్లి మండల వ్యాప్తంగా ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. సామాన్యులు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా దేశ భవిష్యత్తును మార్చే ఆయుధం ఓటు ఒక్కటే కావడం వల్ల సుదూర ప్రాంతాల నుంచి ఓటర్లు ఎండను కూడా లెక్కచేయకుండా వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వేములపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఓటర్లతోపాటు మిర్యాలగూడ నియోజకవర్గ ఎమ్మెల్యే బిఎల్ఆర్ ఓటర్లతో సందడి చేస్తూ ఎన్నికలలో పాల్గొన్నారు. టిఆర్ఎస్ బిజెపి పార్టీలకు సంబంధించిన నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో ఒరాహోరీగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## మొదటిసారి ఓటులో ఆనందం...



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మొదటి సారి ఓటు హక్కు ను వినియోగించుకున్న యువతి యువకులలో చెప్పలేనంత ఆనందామని పొందినట్లు వారు అభిప్రాయలను వ్యక్త పరిచారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కుకై దరఖాస్తూ చేసుకున్న క్షణం నుండి ఓటు వేసే క్షణం వరకు ఎంతో ఉతకంఠతో కాలం గడిపి నేటికీ ఆ అనుభూతిని పొందిన ట్లు వివరించారు. మొట్ట మెదటి సారిగా ఓటును వేసిన ఆనందక్షణాలను తల్లి దండ్రులతో పంచుకుంటూ మొదటి ఓటు ఎటు వేసావని పలకరించగ నాన్న చెప్పిన గుర్తుకు వేశామని కొందరు... తండ్రి లేని వారు తండ్రి ప్రేమించే పార్టీ కె వేషమని కొందరు సమాధానం చెప్పుకొచ్చారు. మొత్తానికి మొదటి ఓటు ను నాన్నకు వేసినట్లు సంతోషం వ్యక్తం చేశారు.

### కోదాడలో పోటెత్తిన ఓటర్లు..

# సాఫీగా సాగిన పోలింగ్



**ప్రజాపక్షం/కోదాడ :** కోదాడ అసెంబ్లీ సెగ్మెంట్ నల్లగొండ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఐదున్నర గంటలు మాక్ పోలింగ్ కాగా అక్కడక్కడ ఈవీఎంలు మొరాయించాయి. కాగా కోదాడ ఆర్డీవో స్పందించి బెల్ ఇంజనీర్ల ద్వారా,మాస్టర్ ట్రైనర్ల ద్వారా యంత్రాల్లో లోపాలను సవరించి పోలింగ్ సజావుగా సాగేందుకు తీవ్రంగా కృషి చేశారు. కోదాడ నియోజకవర్గంలో తొలిరెండు గంటల్లో మందకొడిగా కొనసాగిన పోలింగ్ ఆ తరువాత ఊపు అందుకుంది. వాతావరణం మారి చల్లబడటంతో ఓట్లు వేసేందుక జనం పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరారు. ఎన్నికల కమిషన్ ఓటర్లను చైతన్య పరిచేందుకు మోడల్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో చైతన్యవంతులై ఓటింగ్‌కు పోటెత్తారు. నియోజకవర్గ వ్యాప్తంగా 75.15 ఓటింగ్ శాతం నమోదు అయినట్లు ఎన్నికల సహాయక రిటర్నింగ్ అధికారి ఆర్డీవో సూర్యనారాయణ తెలిపారు.

**డియస్పీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు**

నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాల వద్ద డియస్పీ శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షణలో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో ఎన్నికల అధికారులు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నారు.

## ఎండను లెక్కచేయకుండా బారులు తిరిన ఓటర్లు



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. నల్లగొండ పార్లమెంట్ పరిధిలో సాయంత్రం వరకు సుమారు 71శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం పోలింగ్ ప్రారంభం నుంచి ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించునేదుకు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. కొన్ని ప్రాంతాలలో పోలింగ్ ప్రారంభంలో ఈవిఎం మిషన్లు మోరాయించడంతో ఓటర్లు కొద్దిగా ఇబ్బంది పడ్డారు. పోలింగ్‌లో మహిళలు, ట్రాన్స్ జెండర్లు, యువత పెద్ద ఎత్తున పాల్గొని ఓట్లు వేశారు. జిల్లాలో 61 వేల మంది యువత నూతనంగా ఓటర్లుగా నమోదు చేసుకున్నారని, వీరందరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనేక ఓటరు చైతన్య కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగానే అన్ని నియోజకవర్గాలలో మోడల్ పోలింగ్ కేంద్రాలతో పాటు, ఉమెన్ మేనేజెడ్ పోలింగ్ కేంద్రాలు, దివ్యాంగ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.జిల్లా కేంద్రంలో రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి, తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తోపాటు ఎంఎల్‌ఏలు తమ సొంత గ్రామాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.






## చిట్యాల మండలంలో 79.23 శాతం పోలింగ్

### ఓటు హక్కును వినియోగించుకున్న చెరుపల్లి సీతారాములు దంపతులు



**ప్రజాపక్షం/చిట్యాల :** భారత లోక్‌సభ నాలుగవ విడతలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో సోమవారం జరిగిన ఎన్నికలు నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో శాంతి యుతంగా ముగిశాయి. సిపిఎం పార్టీ కేంద్ర కమిటి సభ్యులు మాజీ ఎంఎల్‌సి చెరుపల్లి సీతారాములు దంపతులు చిట్యాల మున్సిపాలిటిలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. భువనగరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తుంగతుర్తి నియోజకవర్గంలోని శాలిగౌరారం లోని బాలిశెట్టిగూడెంలో, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం నకిరేకల్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కిరణ్‌కుమార్ రెడ్డి నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాలలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఈవిఎం మిషన్లను క్రమపద్ధతిలో పెట్టకపోవడం కారణంగా ఓటర్లు గందరగోళాన్ని ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకుని భువనగిరి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శాసనసభ్యులు వీరేశం కూడా రామన్నపేట, చిట్యాల, నార్కట్‌పల్లి, నకిరేకల్ తదితర మండలాలలో పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నిక సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.

## ఓటు హక్కును వినియోగించుకున్న హైకోర్టు న్యాయమూర్తి దంపతులు



**ప్రజాపక్షం/ రామన్నపేట :** మండలంలోని బోగారం గ్రామంలో హైకోర్టు న్యాయమూర్తి కోనూరు లక్ష్మణ్‌గౌడ్ మంజుల దంపతులు తన పుట్టిన ఊరిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



ఓటు హక్కును వినియోగించుకుకున్న ఎంపీపీ పూసబాలమణి బాలనరసింహా



సిపిఎం అభ్యర్థి ఎండి.జహంగీర్ తన స్వగ్రామం మునిపంపుల గ్రామంలో కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.



## చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయం



**ప్రజాపక్షం/గుండాల :** భువనగిరి పార్లమెంట్ సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయం అయిందని ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాదగిరి గౌడ్ అన్నారు. సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల్ల వ్యాప్తంగా భారీ మెజార్టీ దిశగా పోలింగ్ జరిగిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజల నుండి పూర్తి మద్దతు లభించిందని భువనగిరి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.